## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

అరసవల్లి: శ్రీకాకుళం రూరల్ మండలం కనుగులవానిపేట సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా కల్లేపల్లి ఫీడర్ పరిధిలో పలు గ్రామాలకు ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కల్లేపల్లి, పుక్కల్లపేట, మోపసుబందరు, సాధుపేట, పెద్ద గణగళ్లవానిపేట, పరదేశిపాలెం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేసిన దృశ్యం

గార: మండలంలోని లిటిల్ స్టార్స్ పాఠశాల సిబ్బంది 10 మందికి గ్లోబల్ ఎంపవర్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డి.సద్గుణరావు ఒక్కొక్కరికీ రూ.1000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పి.శ్రీనివాసరావు, పి.పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా చూర్ణోత్సవ వేడుక



స్వామివారికి చూర్ణోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కోదండ రామాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా శనివారం చూర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి నిత్య కైంకర్యాల అనంతరం నూతన వస్త్రాలతో అలంకరించారు. రంగులు జల్లి చూర్ణోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### వాహనాల తనిఖీ



తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ

జి.సిగడాం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రం జి.సిగడాంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మధుసూదనరావు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ధ్రువపత్రాలు భద్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### ఆదిత్యుని సన్నిధిలో ఎన్నికల వ్యయ పరిశీలకుడు



నవీన్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఎన్నికల వ్యయ పరిశీలకుడు, ఐఆర్ఎస్ అధికారి నవీన్‌కుమార్ సోని శనివారం దర్శించుకున్నారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాదాలపై వైద్యులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకాధికారి అశోక్

రణస్థలం: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు రోగుల పట్ల పాటించాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని రణస్థలం అగ్నిమాపకాధికారి పైలా అశోక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రణస్థలం అగ్నిమాపక కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందికి శనివారం అవగాహన కల్పించారు. ఎలక్ట్రికల్ వస్తువులు మండినప్పుడు మంటలను ఎలా అదుపు చేయాలో డెమో చేసి చూపించారు. నివారణ చర్యల కరపత్రాలను పంపిణీ చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రణస్థలం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.లలిత, అగ్నిమాపక సిబ్బంది కె.పోలినాయుడు, బి.ప్రసాద్, ఎ.రాము, జి.లక్ష్మణ, యు.రవి తదితరులు పాల్గొన్నారు.

## • కల్యాణం.. కమనీయం



సింగుపురంలోని హాటకేశ్వరుని దేవాలయంలో శనివారం పార్వతీకొండమ్మ సమేత హాటకేశ్వరుని కల్యాణం కనుల పండువగా సాగింది. ఏటా చైత్రమాసంలో స్వామివారి కల్యాణం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. కార్యక్రమంలో అర్చకులు పెంట చిట్టిబాబుశర్మ, రామ కృష్ణశర్మ, మనోజ్‌శర్మ, రామ్‌కుమార్‌శర్మ, ప్రశాంత్‌కుమార్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం రూరల్

## • శ్రీనివాసా గోవిందా..!



నగరంలోని మొండేటివీధిలో వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశత నామార్చనలు, గోత్రనామాలతో పూజలు జరిగాయి. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. – శ్రీకాకుళం కల్చరల్

## • వెంకన్నకు పుష్పాలంకరణ



నగరంలోని చిన్నబజారులో దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.– శ్రీకాకుళం కల్చరల్

# అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

గార: గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను అమలు చేసి పేదల పక్షాన నిలిచామని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్మనోహర్‌నాయుడు అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కళింగపట్నం పంచాయతీలోని ఉపాధి హామీ వేతనదారులతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ధర్మాన ప్రసాదరావుల పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు. గత ప్రభుత్వంలా జన్మభూమి కమిటీల సిఫారసులకు కాకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు వర్తింపజేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే ఎన్నికల్లో పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ముంజేటి కృష్ణమూర్తి, మార్పు పృథ్వీరాజ్, టి.అప్పలరాజు, ఎం.రమణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



గార: కళింగపట్నంలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ధర్మాన రామ్మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్మనోహర్‌నాయుడు అన్నారు. శనివారం కల్లేపల్లిలో ఉపాధి వేతనదారులతో మమేకమయ్యారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే సంక్షేమ పథకాలు నిరాటంకంగా సాగుతాయని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం 99 శాతం హామీలను నెరవేర్చామని చెప్పారు. తెలుగుదేశం నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మూకళ్ల తాతబాబు, చిట్టి రవికుమార్, గంగు నరేంద్రకుమార్, అల్లు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు సతీమణి గజలక్ష్మి అన్నారు. మామిడివలస, బగ్గువానిపేట గ్రామాల్లో పార్టీ నాయకులు, ఎంపీటీసీ బగ్గు అప్పారావు ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో మోసాలు, జన్మభూమి కమిటీల ఆరాచకాలు, దోపిడీలేనని, వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. ధర్మానను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్ప దివ్య, పార్టీ నాయకులు గొండు కృష్ణ, అల్లు లక్ష్మీనారాయణ, బాణ నర్సింగరావు, బగ్గు అప్పారావు, గుండ హరేష్, చిట్టి రవికుమార్, ఎచ్చెర్ల శ్రీధర్, బాణ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్: కల్లేపల్లిలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న యువ నాయకుడు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ధర్మాన గజలక్ష్మి

## వైఎస్సార్ సీపీతోనే సంక్షేమాభివృద్ధి



సహపురంలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ



జి.సిగడాం: పెళ్లి వేడుక వంటల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎచ్చెర్ల: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమవుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ పరిమళ అన్నారు. శనివారం లావేరు మండలం సహపురం, హనుమంతుపురం, లోపెంట పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, వైస్ ఎంపీపీలు లుకలాపు శ్రీను, అలుపన రమణమ్మ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు బోర సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని జాడ గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్ సీపీ పాలనలోనే అభివృద్ధి జరిగిందని, పార్టీ అభ్యర్థులకే పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, ఎంపీటీసీ పెద్ది శ్రీనివాసరావు, చిక్కాల ధర్మారావు, కోరాడ కేశ్వరరావు, ఇజ్జి కోటి, బొంగ సాయిరాం, ఇజ్జి శ్రీనివాసరావు, కోరాడ అచ్చెరావు, సర్పంచులు తొత్తడి రామారావు, భూపతి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

## పోర్ట్‌ఫోలియో జడ్జిని కలిసిన న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం జడ్జి, శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానాల పోర్ట్‌ఫోలియో న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌ను జిల్లాకు చెందిన పలువురు న్యాయవాదులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జస్టిస్ రామకృష్ణప్రసాద్ వర్క్‌షాప్ నిమిత్తం జిల్లా కోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు మామిడి క్రాంతి, తల్లాడ రాధాకృష్ణ, జి.వాసుదేవరావు, రమణ దయాల్, మురళి, బీసీ న్యాయవాదులు సంఘం ప్రతినిధులు ఆగూరి ఉమామహేశ్వరరావు, అన్నంనాయుడు కలిశారు.

## ధర్మాన నామినేషన్‌కు తరలిరండి



కళింగపట్నంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ రఘురాం, నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.వి.పద్మావతి

గార : శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యునిగా పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు ఈ నెల 24న నామినేషన్ వేయనున్న సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని గార ఎంపీపీ గొండు రఘురామ్, పార్టీ నాయకులు కోరారు. శనివారం కళింగపట్నం, వత్సవలస, అంపోలు పంచాయతీల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పీస గోపి, పీస శ్రీహరిరావు, యాళ్ల నారాయణ, తెనుకోటి అప్పారావు, తమ్మిన అప్పలరాజు, ఎం.రమణ, కిల్లి రఘు, దీర్ఘాసి వీర్రాజు, తిరుపతి, జి.రామారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ధర్మాన ప్రసాదరావు ఈ నెల 24న నామినేషన్ వేయనున్నారని, అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని మండలవీధిలో శనివారం పార్టీ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలవీధి, మహలక్ష్మి నగర్‌కాలనీ, గూనపాలెం, చంపాగల్లవీధి, కాకివీధి పార్టీ ముఖ్య నేతలతో జనసమీకరణపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి, ద్వారపు అజిత్, లెంక రమేష్, రామకృష్ణ, బుక్కూరు ఉమామహేశ్వరరావు, రౌతు సూర్యనారాయణ, నౌపడ విజయ్‌కుమార్, బస్వా మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

### పుణ్యవతి పేరంటాల వార్షికోత్సవం



పుణ్యవతి పేరంటాలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలం పెద్ద లింగాలవలస బొబ్బాదిపేటలో శుక్రవారం నిర్వహించిన పుణ్యవతి పేరంటాల 21వ వార్షికోత్సవాలకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### వ్యయ పరిశీలకులకు ఆహ్వానం



శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు నినా నిగమ్‌కు కలెక్టర్, మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ జి.ఆర్.రాధిక, ఇతర అధికారులు కలెక్టరేట్ వద్ద ఆహ్వానం పలికారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

## ఆదిత్యాలయంలో ఆగ్నేయ స్థాలీపాక హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణం తర్వాత రోజు ఆచార వ్యవహారంగా నిర్వహించే ఆగ్నేయ స్థాలీపాక హోమం శనివారం ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ మండపంలో అర్చకబృందం ఈ హోమాన్ని నిర్వహించారు. విశేష భోగాలను స్వామికి నివేదించారు. అంతకుముందు ఆదిత్యునికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఉత్సవమూర్తులకు సహస్ర మండపంలో ఊయలలో కొలువుదీర్చగా భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

**నేడు వేద సత్కారం..**

ఆదిత్యుని వార్షిక కల్యాణంలో భాగంగా ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సదస్యం, మహాదాశీర్వచనాలు, వేద సదస్సు, పండితుల సత్కారం తదితర కార్యక్రమాలు జరుగుతాయని ఈవో ఎస్.చంద్రశేఖర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు రథోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## 26 నుంచి కల్యాణ వేంకటేశ్వరుడి వార్షికోత్సవాలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక కల్యాణ వేడుకలు ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆలయ ప్రాంగణంలో వార్షికోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26న ధ్వజారోహణం, 27న స్వామివారి కల్యాణం, 28న చక్రస్నానం, అన్నప్రసాద వితరణ జరుగుతుందని, భక్తులంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు బూరాడ వంశీకృష్ణమాచార్యులు, గౌరవాధ్యక్షులు ఎల్.నందికేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



యూనియన్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న జోనల్ హెడ్ షాలినీ మీనన్

శ్రీకాకుళం అర్బన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని యూనియన్ బ్యాంక్ విశాఖపట్నం జోనల్ హెడ్ షాలినీ మీనన్ అన్నారు. శ్రీకాకుళం రామలక్ష్మణ కూడలి వద్ద ఉన్న యూనియన్ బ్యాంక్‌ను శనివారం పెద్దపాడు రోడ్డులోని రామిగెడ్డ సమీపంలోకి మార్చారు. ఈ సందర్భంగా షాలినీ మీనన్ జ్యోతి ప్రజ్వలన చేసి బ్రాంచిని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రూ.120 కోట్ల మేర బ్యాంక్ లావాదేవీలు జరుగుతున్నాయని చెప్పారు. జిల్లాలో యూనియన్ బ్యాంక్ లీడ్ బ్యాంక్‌గా ఉంటూ రూ.7,500 కోట్లతో లావాదేవీలు నిర్వహిస్తూ 45 బ్రాంచిలతో కొనసాగుతోందన్నారు. దేశంలో యూనియన్ బ్యాంక్ 5వ స్థానంలో ఉందన్నారు. అనంతరం ఏటీఎంను ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు వెంకటతిలక్, ఇందిరా ప్రియదర్శిని, కె.తేజేశ్వరరావు, బి.శ్రీనివాసులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో చందనోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని ప్రకాష్‌నగర్ కాలనీలో హజరత్ బంగేషా హుస్సేని రహమతుల్లా అలైహి వస్సలామ్ వారి ఉర్స్ (చందనోత్సవం) శనివారం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్, ముతవల్లి ఎంఏ రఫీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాబా గుసూల్, ఫజర్ నమాజ్, ఖురాన్ పఠనం, విజయనగరం ఖాతున్ (మహిళలు) మీలాద్, ఖుల్ షరీఫ్ చాదర్ సమర్పణ తదితర కార్యక్రమాలు జరిగాయి. మంత్రి ధర్మాన ప్రసాదరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మెంటాడ పద్మావతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

## కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

జి.సిగడాం: గ్రామాల్లో ఎన్నికల నియామవళి ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని మండల రిటర్నింగ్ ఎన్నికల అధికారి ఆర్.ఉమామహేశ్వరరావు సిబ్బంది సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్‌ఓలు, సెక్టార్ అధికారుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలుకావాలన్నారు.

## రాగోలులో చలివేంద్రం

శ్రీకాకుళం రూరల్: రాగోలులో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి అధిక సంఖ్యలో జనం వచ్చి దాహార్తి తీర్చుకుంటున్నారని నిర్వాహకులు, సంఘ రాగోలు అధ్యక్షుడు అనుపోజు కమలాచారి తెలిపారు. జెమ్స్ హాస్పటల్‌కి వచ్చే రోగులు, సహాయకులు, బ్యాంక్ పని నిమిత్తం వచ్చిన వారికి ఉపయుక్తంగా ఉంటోందని చెప్పారు. సంఘ కార్యదర్శి తూరుబాటి శ్రీనివాసరావు, కోశాధికారి అనుపోజు శ్రీనివాసరావు, మండా చంద్రమౌళి, ఎడ్లపల్లి లీలామోహన్‌రావు, గోపాలకృష్ణ, మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులు సమన్వయంతో నిర్వహిస్తున్నారు.